# అభ్యుదయగామి

“అభ్యుదయ రచయితల సంఘంలో చేరుతావా?” అని నా మిత్రుణ్ని అడిగాను.

“కొత్త సాహిత్య పరిషత్తా?” అన్నాడు నా మిత్రుడు.

అవునన్నాను.

“కొత్త సాహిత్య పరిషత్తుల కెంతైనా స్థానం ఉంది మన దేశంలో. ఎందుచేతనంటే మన సాహిత్యం మీద విమర్శలేదు. అసలు సాహిత్యమే చదవరు. విమర్శలెవరు చదువుతారు? కొత్త సాహిత్యోద్యమాలవల్ల విమర్శలేని లోటు తీరిపోతుంది. అదీకాక మన రచయితలకు పేరు ప్రఖ్యాతులు బొత్తిగా ఉండటం లేదు. వాళ్లు అప్పుడప్పుడూ కొత్త సాహిత్య పరిషత్తుల్లో చేరి ఉపన్యాసాలిస్తుంటేగాని ఎవరూ గమనించరు. అందుచేత ఈ – దీని పేరేమిటీ? – ఈ అభ్యుదయ సాహిత్యోద్యమాన్ని నేను కూడా బలపరుస్తున్నాను. కాని ఈ ఉద్యమం రాజకీయాల జోలికి పోతుందని చూచాయగా విన్నాను. అది చాలా పొరపాటు –” అని ప్రారంభించాడు నా మిత్రుడు.

“ప్రజాస్వామ్యంటే రాజకీయాల్లో వేలు పెట్టే హక్కు ప్రతివాడికీ ఉండటం కాదా?” అన్నాను.

“అయితే అవుగాక! ఉత్తమ కళారాధకులూ, శాస్త్రజ్ఞులూ, వైజ్ఞానికులూ రాజకీయాల జోలికి పోరాదు. సాహిత్యం కాంగ్రెసు కార్యక్రమాన్ని బలపరుస్తూ, గాంధీజీ ప్రబోధాలు ప్రచారం చేస్తే చాలు, రాజకీయాలనవసరం.”

“అభ్యుదయ రచయితలు పాక్షిక రాజకీయాలకు ఎడంగా ఉంటారు” అన్నాను.

“అదే నేనూ కోరేది… అయినా, ఈ సంస్థకు రాజకీయాలతో సంబంధం లేదని రుజువు చేసేటందుకు, కమ్యూనిస్టులకిందులో స్థానం లేదని ప్రకటిస్తే బాగుంటుంది” అన్నాడు నా అమూల్య మిత్రుడు.

***ముద్రణ : ఆనందవాణి, 20 జూలై 1947***